# ఇంజనీరింగ్ ఫీజుల పెంపు వాయిదా!

**ప్రైవేటు కాలేజీల జమా ఖర్చులపై నివేదిక ఇవ్వాలన్న సీఎం**

- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేలిందేమిటి అంటూ ప్రశ్న.. అధ్యయనం తర్వాత చూద్దామని వ్యాఖ్య
- విద్యాశాఖ ఉన్నత అధికారులతో సమీక్ష
- గురుకులాలకు తాళాలు, అధికారుల తీరుపై ఆగ్రహం!



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల పెంపును వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు కాలేజీల జమా ఖర్చుల ప్రతిపాదనలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అసలు ఇంజనీరింగ్ ఫీజులు పెంచాల్సిన అవసరం ఉందా? అని కూడా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ, ఇంజనీరింగ్ కాలేజీల కౌన్సెలింగ్ షెడ్యూల్, టీచర్ల సమస్యలు, ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల పెంపు, గురుకుల హాస్టళ్ల నిర్వహణ తదితర అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా ఇంజనీరింగ్ ఫీజుల విషయమై సీఎం.. అధికారులను అనేక ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. ప్రైవేటు కాలేజీలపై గతంలో వేసిన టాస్క్‌ఫోర్స్ నివేదికలోని అంశాలేంటి? అని నిలదీశారు. ఫ్యాకల్టీ లేకపోవడం, ఇష్టానుసారం

మిగతా 13వ పేజీలో ▶

## నైపుణ్యం పెంచాలి

**విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు, నైపుణ్యం పెంచేలా విద్యా వ్యవస్థలో మార్పులు తేవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మౌలిక వసతుల కల్పన, టీచర్లకు శిక్షణ ఇచ్చే విషయంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు.**

# ఇంజనీరింగ్ ఫీజుల పెంపు వాయిదా!

▶ మొదటి పేజీ తరువాయి

సీట్లు పెంచుకోవడం, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేయడం వంటి అంశాలపై టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేలిందేంటని ప్రశ్నించారు. అయితే, అధికారులు ఇందుకు సంసిద్ధంగా లేకపోవడంతో సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ముఖ్యమంత్రి వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సమీక్షకు వచ్చేటప్పుడు కనీసం అవసరమైన నివేదికలతో రావద్దా?' అంటూ ప్రశ్నించారు. ఫీజులకు, ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు లింక్ పెట్టడం సరికాదు.. కాలేజీలపై పూర్తి అధ్యయనం చేసిన తర్వాతే ఫీజుల వ్యవహారం చూద్దాం అని అన్నారు.

**తాళాలపై తీవ్ర ఆగ్రహం..**

అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు బిల్లులు విడుదల చేయలేదని యజమానులు తాళం వేయడంపై ముఖ్యమంత్రి సీరియస్‌గా స్పందించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇంత జరుగుతుంటే కనీసం ప్రభుత్వం దృష్టికి ఎందుకు తేలేదని నిలదీశారు. విద్యాశాఖ అధికారులు పనిచేస్తున్నారా? లేదా? అనే అనుమానం కలుగుతోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్కూళ్లు రీఓపెన్ అయిన తర్వాత ప్రభుత్వ స్కూళ్లలో చేరిన విద్యార్థుల సంఖ్యను అధికారులు వివరించలేకపోవడం కూడా సీఎంను ఆగ్రహానికి గురి చేసింది. బడిబాట కార్యక్రమం రాష్ట్రంలో ఎక్కడా సజావుగా సాగడం లేదని, టీచర్లు దీన్ని సీరియస్‌గా తీసుకోలేదని, ఉన్నతాధికారులు కూడా పట్టించుకోలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలాచోట్ల పుస్తకాలు, దుస్తులు అందడం లేదని విమర్శలు వస్తున్నా అధికారులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నాయని, నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదని, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు ఇచ్చిన వివరణపై కూడా ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లు ఇచ్చే అంశంపై కూడా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## కొత్తగా 571 పాఠశాలలు: సీఎం

ఇరవై మందికన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకుని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యాశాఖపై సీఎం శుక్రవారం నిర్వహించిన సమీక్షకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి, ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు.

# కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ టీకేకే రెడ్డి




ఐఈఈఈ పీఈఎస్ స్టూడెంట్ చాప్టర్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ ఎలక్ట్రికల్ విభాగంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఐఈఈఈ) పవర్ అండ్ ఎనర్జీ సొసైటీ(పీఈఎస్) స్టూడెంట్ చాప్టర్ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఈఈఈ పీఈఎస్ రీజియన్-10 కార్యదర్శి డాక్టర్ వీఎస్‌కే మూర్తి మాట్లాడారు. ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ పుస్తకాన్ని ఆవిష్కరించగా పీఈఎస్ స్టూడెంట్ చాప్టర్ లక్ష్యాలను చాటిచెప్పేలా ట్రాన్స్‌ఫార్మ్ అక్షరాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, ప్రొఫెసర్లు డాక్టర్ కె.నాగ సుజాత, డాక్టర్ కె.అనితా షీల, ఈఈఈ అధినేత డాక్టర్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో కేకే, ఉన్నతాధికారులు

# ఇష్టారీతిన ఫీజుల పెంపా?

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇప్పటికే ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నాయ్

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు

విద్యార్థులపై భారం పడకుండా చూడండి.. అధికారులతో సీఎం

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారీతిన ఫీజులు పెంచుకుంటూ పోతారా? అని ప్రశ్నించారు. అనేక ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నా యన్న ఆయన.. పేద విద్యార్థులు ప్రతిభ ఆధారంగా కన్వీనర్ కోటాలో ప్రముఖ కాలేజీల్లో సీటు సాధించినా, వార్షిక ఫీజు చెల్లించ లేని స్థితిలో ఉన్నారని గుర్తుచేశారు. విద్యార్థులపై భారం పడకుండా

మిగతా 9వ పేజీలో...

ఆంధ్రజ్యోతి

# ఇష్టారీతిన ఫీజుల పెంపా?

(మొదటిపేజీ తరువాయి)

చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ లాంటి వృత్తివిద్య కోర్సుల్లో ఫీజులను మూడేళ్లకోసారి సమీక్షించాల్సి ఉంటుంది. 2025-28 సంవత్సరాలకు సంబంధించిన ఫీజులపై ఇటీవలే ఫీజు నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్‌సీ) ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఇందులో హైదరాబాద్ పరిసరాల్లోని అనేక కాలేజీల్లో ఫీజును 100 శాతం పెంచారు. ఇది చాలా ఎక్కువ అంటూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఎఫ్ఆర్‌సీ ప్రతిపాదనలను తిరస్కరించారు. కళాశాలల్లో మౌలిక వసతులను పరిగణనలోకి తీసుకొని ఫీజు పెంపు గరిష్ఠంగా 30 శాతం ఉండాలని, అంత కంటే ఎక్కువ ఉండరాదని గత నెలాఖరులో జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు. దీంతో ఫీజుల పెంపుపై ఎఫ్ఆర్‌సీ మళ్లీ కసరత్తు ప్రారంభించింది. జూలై మొదటి వారంలో ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నందున.. అంతకుముందే ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఎం అధ్యక్షతన జరిగిన విద్యాశాఖ ఉన్నతస్థాయి సమీక్షలో ఫీజుల పెంపు అంశం చర్చకు వచ్చింది. గతంలో పెంచిన ఫీజు ప్రతిపాదనలు, మళ్లీ జరుగుతున్న కసరత్తును అధికారులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని అనేక కాలేజీల్లో ఇంజనీరింగ్ ఫీజులు ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా నగరంలోని ప్రముఖ కాలేజీల్లో సీట్లు దక్కినా.. పేద విద్యార్థులు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొందని సీఎం అన్నట్లు తెలిసింది. అనేక కాలేజీలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో 'ఇంజనీరింగ్ కాలేజీలపై గత ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ నివేదికలు ఏమయ్యాయి? అందులో ఏం తేలింది? ఆ నివేదికలు సమర్పించండి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆలస్యమైనా పర్వాలేదు, మళ్లీ అధ్యయనం చేయాలని.. విద్యార్థులపై భారం పడకూడదని స్పష్టం చేసినట్లు తెలిసింది.